విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

గురువారం 14 నవంబర్ 2024

8 పేజీలు

కేసులకు భయపడొద్దు

- వైసీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి
- మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమే
- బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున

రాష్ట్రంలో ప్రభుత్వ అధికారం దుర్వినియోగం అవుతుందని బాపట్ల జిల్లా వైసీపీ అధ్యక్షులు మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. పట్టణంలోని ఎంసీఏ హాలులో బుధవారం రేపల్లె నియోజకవర్గం వైసీపీ కార్యకర్తల, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో మేరుగ మాట్లాడుతూ రాజకీయాల్లో వ్యక్తిత్వం,విశ్వసనీయత చాలా ముఖ్యమని తెలిపారు.

2లో

-విశాలాంధ్ర, రేపల్లె :

వాయు కాలుష్యం నియంత్రించాలి

ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు నగరంలో వాయు కాలుష్యం నియంత్రణకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశపు హాలులో కలెక్టర్ అధ్యక్షతన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వాయుకాలుష్య నియంత్రణ అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ మాట్లాడుతూ ఒంగోలు నగరంలో వాయు కాలుష్యం వ్యాపించడంపై మూలకారణాలు తెలుసుకుని, వాటిని నియంత్రించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు.

2లో

-విశాలాంధ్ర, ఒంగోలు :

రోడ్డెక్కిన బాధితులు

- సంఘీభావం తెలిపిన గిరిజనులు
- రెండు గంటలపాటు స్థంభించిన ఐలాండ్ సెంటర్
- రంగ ప్రవేశం చేసిన పోలీసులు
- రాకేష్‌వర్మ హామీతో ఆందోళన విరమణ

విశాలాంధ్ర - బాపట్ల :

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధితులు న్యాయం కోసం రోడ్డెక్కారు. కుటుంబ దిక్కును కోల్పోయాం ముగ్గురు పిల్లలతో ఎలా బతకాలయ్యా.... అంటూ మృతుల భార్యలు విలపించారు. దీంతో కర్లపాలెం ఐలాండ్ సెంటర్ రోధనలతో మిన్నంటాయి. కర్లపాలెం మండలం బుద్దాం వద్ద మంగళవారం ఆటోను రాయల్ మెరైన్ కంటైనర్ ఢీకొన్న ఘటనలో ఇరువురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం బాధితులు కుటుంబీకులు బంధువులు కర్లపాలెం జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. మృతుల కుటుంబాలకు సంఘీభావంగా బాపట్ల నియోజకవర్గంలోని గిరిజనులు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండు కుటుంబాలను రోడ్డున పడేసిన డ్రైవర్ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన మృతులకు ఒక్కొక్కరికి రూ. 25 లక్షల నగదు, మృతుల పిల్లలకు చదువులకు అయ్యే ఖర్చు, మృతుల భార్యకు ఉద్యోగం ఇచ్చేంతవరకు ఇక్కడి నుంచి వెళ్ళేది ఉగ్గపట్టు పట్టారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశనకు చెందిన రాయల్ మెరైన్ కంపెనీకి చెందిన కంటైనర్ ఢీకొన్నా ఇప్పటి వరకు ఎమ్మెల్యే ఎందుకు పరామర్శిచలేదని ప్రశ్నించారు. గతంలో దమ్మనవారిపాలెం వద్ద ట్రాక్టర్ బోల్తా ఘటనలో త్వరగా స్పందించిన ఎమ్మెల్యే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కంపెనీ యాజమాన్యం వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని ధర్నా విరమింపచేయాలని ఆందోళనకారులను కోరారు. న్యాయం జరిగేంత వరకు ధర్నా విరమించ మని ఎస్సైకి చెప్పారు. పరిస్థితి చేయిదాటిపోవడంతో విషయం తెలుసుకున్న రూరల్ సర్కిల్ సీఐ హరికృష్ణ, డీఎస్పీ రామాంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆందోళన విరమించాలని కోరారు. బాపట్ల ఎమ్మెల్యే తనయుడు వేగేశన రాకేష్ వర్మ బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల నగదు ఇచ్చి కంపెనీ ప్రతినిధులతో చర్చించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పొదిలిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.కరుణానిధి

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 20వ ప్రకాశం జిల్లా మహాసభలు 19న పొదిలిలో జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.కరుణానిధి కోరారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను ఏఐఎస్ఎఫ్ నాయకులతో కలసి ఆవిష్కరించారు. కరుణానిధి మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల మీద ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందిస్తారని తెలిపారు. ఈ మహాసభలకు ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.శివారెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రామాంజి యాదవ్ మాట్లాడుతూ పొదిలిలో జరిగే ఏవైఎస్ఎఫ్ జిల్లా మహాసభలకు దర్సి నుండి అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని మహాసభ జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ దర్శి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కే సురేంద్ర, జి స్టాలిన్, నాయకులు చంద్రశేఖర్, శ్రీను, జోయల్, చందు పాల్గొన్నారు.

- విశాలాంధ్ర-దర్శి :

ప్రభుత్వం మారినా గుంతల్లోనే..

'కొండపి రోడ్డు' కష్టాలు తీరేనా?

టంగుటూరులోని కొండపి రోడ్డు గత ఐదారు సంవత్సరాల నుండి గుంతల మయమై స్థానిక ప్రజలు మూడు మండలాలకు చెందిన ప్రజలు గుంతల రోడ్లో ప్రయాణం చేయడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వందల కోట్ల రూపాయలతో గుంతలు లేని రోడ్లు అనే కార్యక్రమాన్ని చేపట్టింది. కార్యక్రమాన్ని ప్రారంభించి 10 రోజులు గడుస్తున్నా టంగుటూరు మండలంలో ఒక్క రోడ్డు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. మండల కేంద్రమైన టంగుటూరులో కొండేపి రోడ్డును కూటమి ప్రభుత్వమైన తారు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- విశాలాంధ్ర, టంగుటూరు:

భూమిని గుర్తించండి

బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ల్యాండ్ బ్యాంక్ కొరకు భూమిని గుర్తించి తహసీల్దార్లు స్పష్టమైన నివేదిక ఇవ్వాలని బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. ల్యాండ్ బ్యాంక్, స్మశాన భూముల సమస్య, ఎస్టీలకు ఆధార్ నమోదు ప్రక్రియపై రెవెన్యూ అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఖాళీ భూములను సంరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని చెప్పారు. ప్రభుత్వ భూములను అభివృద్ధికి వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఇందుకోసం ఖాళీ భూములను సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా పెట్రోల్ బంకులు వంటివి రెవెన్యూ ఆధీనంలోనే ఉండేలా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా ఆదాయ వనరులు పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

- విశాలాంధ్ర, బాపట్ల :

వాటర్ ట్యాంక్ మార్చండి

విశాలాంధ్ర-మద్దిపూడి : చిరుజల్లు కురుస్తున్న సమయంలో పిడుగుపాటుకు శిథిలావస్థనున్న ఓవర్ హెడ్ హెడ్ వాటర్ ట్యాంక్ ఒక్కసారి ఊగిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురై పక్కకు పరుగులు తీశారు. మద్దిపూడి మండలంలోని గుళ్ళ సముద్రంలో కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ ఉరుములకు పిడుగులకు పెచ్చులూడింది. దశాబ్దాల క్రితం నిర్మించిన ట్యాంక్ నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది పెచ్చులు ఊడి ఊచలు బయటపడి ప్రమాదకరంగా మారింది. ఈ వర్షాలకు ఈదురు గాలులకు పిడుగులకు ఎక్కడ కూలి పోతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే దానిని కూల్చివేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మండలం బండ్లమూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాల యందు కీర్తిశేషులు మార్తుల బాలరెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా వారి కుమారులు వెంకారెడ్డి మరియు తిరుపతి రెడ్డి పాఠశాల విద్యార్థులకు ప్యాడ్స్, పెన్స్, పెన్సిల్లు స్లేలు తదితర పరికరములను రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి తరుపున బహుకరించారు. ఈ కార్యక్రమానికి స్కూలు హెడ్ మాస్టర్ టి.ఎల్ కాంతారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు కదవా రామకృష్ణ, సెక్రెటరీ కే.వీ సుధాకర్,మాజీ ప్రెసిడెంట్ సెక్రటరీలు పోకూరి రామకృష్ణారెడ్డి, మన్నం నాగరాజు, వీరారెడ్డి మాస్టారు, పరంకుశం శ్రీనివాసమూర్తి,మార్తుల తిరుపతి రెడ్డి,వెంకారెడ్డి,నాగెళ్ళ సత్యం, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు శిద్దా సుధాకర్, ఎస్ఎంసి చైర్మన్ గద్దం రమేష్, బండ్లమూడి వైస్ సర్పంచ్ గోపిరెడ్డి పద్మా ఓబుల్ రెడ్డి, బండ్లమూడి ఎంపీటీసీ యానం విజయలక్ష్మి శేషిరెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు వనిపెంట పిచ్చిరెడ్డి, పెమ్మా నర్సింహారావు,వనిపెంట శ్రీనివాస్ రెడ్డి,గోపిరెడ్డి వెంకారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-మార్కాపురం : కే.ఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ మరియు బెంగుళూరు క్యాంపస్లలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికై జాతీయ స్థాయిలో ప్రతిభ పరీక్షని డిసెంబర్ 6 నుండి 13 వరకు నిర్వహిస్తున్నట్లు కే.ఎల్. డీమ్డ్ యూనివర్సిటీ అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ డాఎం జె. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మార్కాపురం శ్రీ సాధన జూనియర్ కళాశాల ఆవరణలో పోటీ పరీక్షకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే ఈ పరీక్షల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు 100 కోట్ల రూపాయల మేర మెరిట్ స్కాలర్ షిప్స్ అందజేస్తున్నట్లు వివరించారు. అదే విధంగా కే.ఎల్.డీమ్డ్ విశ్వవిద్యాలయములో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌళిక వసతులు కల్పిస్తున్నామని, ప్రపంచంలోని అనేక ప్రముఖ విశ్వవిద్యాలయాలతో ఒప్పందం చేసుకొని అత్యుత్తమ విద్యను అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేస్తూ 100 శాతం క్యాంపస్ ప్లేస్మెంట్స్ కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, ప్రస్తుత విద్యా సంవత్సరములో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో తమ విద్యార్థులు 4600లకు పైగా ప్రీ క్యాంపస్ ప్లేస్మెంట్స్ ఆఫర్ పొందారని వారిలో సంవత్సరానికి 40లక్షల నుండి 58 లక్షల వరకు అత్యధిక వేతనాలు పొందిన వారు కూడా ఉన్నారని చెప్పారు.

కేసులకు భయపడొద్దు

- వైసీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి
- మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమే
- బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్రంలో ప్రభుత్వ అధికారం దుర్వినియోగం అవుతుందని బాపట్ల జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. పట్టణంలోని ఎంపీపీ హాలులో బుధవారం రేపల్లె నియోజకవర్గం వైసీపీ కార్యకర్తల, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి రేపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ రాజకీయాల్లో వ్యక్తిత్వం,విశ్వసనీయత చాలా ముఖ్యమని తెలిపారు. కష్టం వచ్చినప్పుడు అండగా నిలబడగాలని వ్యాఖ్యానించారు. గత ఐదేళ్లలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చామని,ప్రతి ఏడాది సంక్షేమ క్యాలెండర్ విడుదల చేశామని, ఏ పథకానికి ఎంత బడ్జెట్ కేటాయించామో స్పష్టంగా చెప్పామని గుర్తుచేశారు. క్యాలెండర్ ప్రకారం వాటిని విడుదల చేసి రాష్ట్ర ప్రజలకు అండగా ఉండేవాళ్లమన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి కనిపించడం లేదని సూపర్ సిక్స్ పథకాలు అమలు కాని హామీలుగా నిరుపయోగంగా ఒక మూలన పడి ఉన్నాయని విమర్శించారు.వైసీపీ పాలనకు,టీడీపీ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించారని పేర్కొన్నారు. రెండు ప్రభుత్వాల్లో ఎవరికి ఎంత మంచి జరిగిందనే దానిపై ప్రతి కుటుంబంలోనూ చర్చ జరుగుతుందని చెప్పారు. చంద్రబాబు అబద్ధాల హామీలు ఇప్పుడు మోసాలుగా మారాయని విమర్శించారు. చంద్రబాబు మోసాలపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతుందన్నారు. నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో పరిస్థితులు దిగజారాయని విమర్శించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఓపికతో ముందుకు సాగాలని, ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. ప్రజల తరపున పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వైసీపీ కార్యకర్తలు కేసులకు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు.రేపల్లె వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి దమ్ముంటే రానున్న ఎన్నికల్లో ఏ పార్టీకి ఆ పార్టీ ఒంటరిగా పోటీ చేసి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పై గెలుపొందితే అది రాజనీతి అని,జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కోలేని టిడిపి,జనసేన,బిజెపి పార్టీలు ప్రజలను మోసం చేసి,అబద్ధపు హామీలు ఇచ్చి గెలుపొందటం ఒక గెలుపా అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.నారావారి సారాతో నాణ్యమైన ముందుగా చిత్రీకరించి తాగు,ఊగు,కుటుంబాలను భయభ్రాంతులకు గురి చేయండి అన్న విధంగా కూటమి పాలన సాగుతోందని ఆయన ఎద్దేవా చేశారు.కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి డాక్టర్ ఈవూరు గణేష్, వేమురు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు,వైఎస్ఆర్సిపి నాయకులు మదన్ మోహన్ రావు, బొర్రా శ్రీనివాసరావు,చదలవాడ శ్రీనివాసరావు,పట్టెం శ్రీనివాసరావు,కామినేని కోటేశ్వరరావు, రేపల్లె పట్టణ అధ్యక్షులు గద్దం రాధాకృష్ణమూర్తి,సిహెచ్ బాలాజీ,చిత్రాల ఓబేదు, అబ్దుల్ కుదుస్, సజ్జ పద్మావతి,చంద్రపాల్, షేక్ ఫరీద్, షేక్ కరీముల్లా, ఎస్.కె సిరాజుద్దీన్, రేపల్లె నియోజకవర్గంలోని నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, రేపల్లె రూరల్, రేపల్లె టౌన్ పరిధిలోని వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో 425.2 మి.మీ వర్షపాతం నమోదు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : జిల్లాలో 38 మండలాలకు గాను 29 మండలాలలో 425.2 మి.మీల వర్షపాతం జిల్లా సరాసరి 11.2 మి.మీ ల వర్షపాతం నమోదు అయినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాస రావు తెలిపారు. అందులో అత్యధికంగా శింగర రాయ కొండలో 70.2 మి.మీలు, అత్యల్పంగా త్రిపురాంతకంలో 0.6 మి.మీలు నమోదు అయినట్లు తెలిపారు. జిల్లాలో మిగిలిన మండలాలు జరుగుమల్లి 50.6 మి.మీలు, చీమకుర్తి 33.4, సంతనూతల పాడు 32.6, పొన్నలూరు 29.6, కొండెపి 26.4. ఒంగోలు 19.2, పామూరు 18.0, దర్శి 16.8, కురిచేడు 16.4, ముండ్లమూరు 15.8, టంగుటూరు 11.4, పీసీ పల్లి 10.0, తాళ్లూరు 9.4, పొదిలి 6.6, కొత్త పట్నం 6.4, మద్దిపూడి 6.2, యర్రగొండ పాలెం 6.0, కొనకల మిట్ట, కనిగిరిలో 5.8, మార్కాపురం.6, హెచ్ ఎం పాడు 5.0, దొనకొండ 4.2, గిద్దలూరు 2.6. దోర్నాల, పెద్దారవీడు, సీ ఎస్ పురం 2.4 చొప్పున, వెలిగండ్ల 2.0, మద్ది పాడు 1.4 మి.మీల చొప్పున నమోదు అయినది. రబీలో పొగాకు, ఇతర పంటల ముమ్మర సాగులో ఉన్న సమయంలో కురుస్తున్న వర్షాల వలన సాగు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే సాగు చేసిన పంటలలో వర్షపు నీటికి బయటకు పంపి, సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ జెడీఏ శ్రీనివాసరావు వివరించారు.

బంగారు బాల్యం వారోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు నిర్వహించే 'బంగారు బాల్యం' వారోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహశీల్దార్ జితేంద్ర పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం బంగారు బాల్యం వారోత్సవాల కార్యక్రమంపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మహిళా పోలీసులు, వీఆర్వో లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత ప్రకాశంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు బంగారు బాల్యం కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కమిటీల ద్వారా వారం రోజుల పాటు ప్రతిరోజూ ఒక కార్యక్రమం చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపీడీఓ రంగనాయకులు మాట్లాడుతూ బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా 14న ఉదయం 9 గంటలకు అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో బాల్య వివాహాలపై ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. 15న మన హక్కులు తెలుసుకుందాం టీం ద్వారా అన్ని పాఠశాలల్లో పాఠశాల మేనేజ్మెంట్ కమిటి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.

వాయు కాలుష్యం నియంత్రించాలి

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు నగరంలో వాయు కాలుష్యం నియంత్రణకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ. తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని సమావేశపు హాలులో జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా అధ్యక్షతన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వాయుకాలుష్య నియంత్రణ అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి దేశంలోని వాయు కాలుష్యం కలిగిన నగరాలలో కాలుష్య నియంత్రణకు ప్రణాళికబద్దముగా చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. వాటిలో ఒంగోలు నగరం ఒకటని, ఒంగోలు నగరంలో వాయు కాలుష్యం వ్యాపించడంపై మూలకారణాలు తెలుసుకుని, వాటిని నియంత్రించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి వాయు కాలుష్యం నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్య నియంత్రణకు ఒంగోలు నగరంలో పెద్దఎత్తున మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలని, వాహనాల ద్వారా కాలుష్యం వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో తడి, పొడి చెత్తల నిర్మూలన విధానాన్ని నిబంధనల ప్రకారం చేయాలన్నారు. వాహనాలకు వినియోగించే ఇంధనం కల్తీ లేకుండా చూడాలని, ప్రతీ పెట్రోల్ బంక్ లలో సరఫరా అయ్యే ఇంధనం నిబంధనల మేరకు ఉన్నదా లేదా అని అధికారులు తనిఖీ చేయాలన్నారు. వాహనాలు కూడా నిర్దేశించిన కాలుష్యాన్ని విడుదల చేస్తున్నది లేనిది పరిశీలించాలన్నారు. ఒంగోలు నగరంలో వాయు కాలుష్యం వ్యాప్తి చెందే ముఖ్యమైన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించాల్సిన బాధ్యత అధికారులపైన ఉందన్నారు. వాయు కాలుష్య నియంత్రపై తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు కూడా అవగాహన కలిగించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాఘవ రెడ్డి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, డిటిసి శ్రీమతి సుశీల, జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాస రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మశ్రీ, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస రావు, మైన్స్ డిడి శ్రీ రాజశేఖర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

మోతాదు మించితే నేల విష పూరితం

విశాలాంధ్ర-దొనకొండ: ఎరువులను మోతాదు మించి వాడితే నేల విష పూరితమై పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు నశిస్తాయంటూ వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీ నారాయణ తెలిపారు. దొనకొండ పంచాయతీలోని యర్రబాలెం, బాదాపురం గ్రామాల్లో ఆయన బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన రైతులు పండించిన పంటలను పరిశీలించారు. అధికంగా ఎరువులు వాడకుండా భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను వాడినట్లయితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఈ నెల 17 నుండి ఈ పంట నమోదు జరుగుతుందని, రైతులు స్వయంగా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. అనంతరం యర్రబాలెం రైతులకు మట్టి నమూనా ఫలితాల పత్రాలను అందజేశారు. ఆయన వెంట విస్తరాధికారి యోగేశ్వరరావు, విన్నిబాబు, ఆయా గ్రామ రైతులున్నారు.

కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర-వెలిగండ్ల : కుటుంబ సర్వేను గ్రామ గ్రామ గ్రామాన పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో అన్నమ్మ సూచించారు. బుధవారం మండలంలో గత రెండువ రోజు సచివాలయ సిబ్బంది చేయుచున్న సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఒంగోలు అన్నమ్మ పర్యవేక్షించారు. ఆమె మండలంలోని పీ. రాళ్లపల్లి, మరపగుంట్ల, పందువ తదితర పంచాయతీల్లో పరిశీలించారు. సర్వేలో ఏ ఒక్క ఇల్లు కూడా తప్పిపోకుండా ఎక్కడ కూడా పొరపాట్లకు తావివ్వకుండా సరైన సమాచారాన్ని నమోదు చేయాలన్నారు సర్వేను పూర్తి చేసేందుకు సిబ్బంది చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో కనిగిరి నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి నేడు ప్రణాళిక

విశాలాంధ్ర-వెలిగండ్ల : పంచాయతీ అభి వృద్ధి ప్రణాళిక ప్రణాళిక సమావేశం గురువారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఒంగోలు అన్నమ్మ తెలిపారు. గురువారం నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు జడ్పీటీసీలు సర్పంచులు అధికారులు ప్రభుత్వ సిబ్బంది పాల్గొని గ్రామాల్లో కావలసిన మౌలిక సదుపాయాలు అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసి 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రణాళికలు సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపించవలసి ఉంటుందని ఆమె సూచించారు.

సంక్షేమ పథకాలకు ఆధార్ సీడింగ్ తప్పనిసరి

మార్కాపురం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.శ్రీనివాసులు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల నగదు అకౌంట్‌లో పొందడానికి ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని మార్కాపురం పోస్టల్ డివిజనల్ సూపరిం టెండెంట్ జి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన బస్టాండ్ సెంటర్‌లో పోస్టల్ అకౌంట్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి ప్రాంతీయ సచివాలయాల పరిధిలో పోస్టాఫీస్ ద్వారా ఐపీపీబి అకౌంట్ ఓపెన్ చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 65 లక్షల మందికి ఎంపీసీఐ మ్యాపర్‌లో ఆధార్ సీడింగ్ లేకపోవడం వలన వారికి సంక్షేమ ఫలాలు అందే అవకాశం లేదని కావున ప్రతి ఒక్కరూ ఐపీపీబీ అకౌంట్ ఓపెన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనిగిరి సబ్ డివిజనల్ హెడ్ దినకరకుమార్, సీఎస్‌పురం పోస్ట్‌మాస్టర్ నూకసాని వెంకటరావు, ఐపీపీబీ అసిస్టెంట్ మేనేజర్ జి ప్రజ్వల, ఎం.రామారావు, ఇతర తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ సీఐ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సిఐ జి.సోమశేఖర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి స్టేషన్ సిబ్బందికి స్టేషన్ యొక్క పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని, స్టేషన్లోని పలు రికార్డులను మరియు పెండింగ్ కేసులను తనిఖీ చేసి అనంతరం స్థానిక ఎస్సై అనూక్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మహిళా పోలీసులు, కానిస్టేబుళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో సిబ్బంది యొక్క పనితీరును తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులు అన్ని పూర్తి చెయ్యాలి అని సూచించారు. పేకాట, గంజాయి, అక్రమ మద్యం అమ్మకాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఎస్సైకి సూచించారు. దొంగతనాలు జరగకుండా పోలీస్ అధికారులు రాత్రిపూట పెట్రోలింగ్ చెయ్యాలి అన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

పరిసరాల పరిశుభ్రత

విశాలాంధ్ర-పొదిలి : పొదిలి పట్టణంలోని హైస్కూల్ మైదానంలో వర్షానికి గడ్డి పెరిగి విషపూరితమైన పురుగులు, పాములు, తేళ్ళు, మొదలైన అవశేషాలు ఉండడం గమనించిన హబీబుల్లా ఫౌండేషన్ చైర్మన్ కరిముల్లా బేగ్ మంగళవారం మైదానం పరిశుభ్రత పరిరక్షణ కోసం మోటార్ యంత్రం ద్వారా తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. కరిముల్లా బేగ్ మాట్లాడుతూ ప్రతి రోజూ 1000 మందికి పైగా హైస్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థులు, వందలాదిమంది వ్యాయామం చేసేందుకు మైదానంలోకి వస్తున్న దృష్ట్యా వారి ఆరోగ్య భద్రత కోసం పరిసరాల పరిశు భ్రత పరిరక్షణ కోసం మోటార్ యంత్రం ద్వారా తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది షేక్ షబ్బీర్, ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరికి రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు హర్షణీయం : మాధవ ప్రసాద్

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కరువు ప్రాంతమైన పశ్చిమ నియోజకవర్గం కనిగిరిలో రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు టీడీపీ నాయకులు నారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్ తెలిపారు.

ఎన్నికల హామీలో భాగమైన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, జిల్లా విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో కరువు ప్రాంతమైన కనిగిరిలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడం కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా రిలయన్స్ సంస్థకు ఈ సందర్భంగా మాధవప్రసాద్ రిలయన్స్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోండి

ఎంఏఓ బాలకృష్ణ నాయక్

విశాలాంధ్ర-దర్శి : దర్శి మండలంలోని రైతులు రాష్ట్ర ప్రభుత్వం కల్పించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బాలకృష్ణ నాయక్ అన్నారు. కొత్తపల్లి, కొర్లమడుగు రైతు సేవా కేంద్రం పరిధిలోని పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ వి బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ రైతులందరూ కూడా వ్యవసాయ శాఖ సేవలను వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ ప్రతి మంగళ మరియు బుధవారాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా క్షేత్ర సందర్శన జరుగుతుందని పంటలపై ఆశించు చీడపీడలు, తెగుళ్ల గురించి క్షేత్ర సందర్శన ద్వారా తెలియజేయడం జరుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ నందు సబ్సిడీలో అందిస్తున్న శనగ విత్తనాలు 1 క్వింటా పూర్తి ధర 9400రూ. సబ్సిడీ 2350రూ. రైతు కట్టవలసినది 7050రూ. రైతులు రబీ పంటల యొక్క ఇన్సూరెన్సు మీ సేవ నందు డిసెంబరు15 లోగా కట్టుకోవలెనని తెలియచేసారు. ఈ రబీ పంట కాలంలో పొగకు పంటకు ప్రత్యమ్నాయంగా రైతు సోదరులందరూ శనగ, మినుము, పెసర, ఇతర పంటలను సాగుచేయాలని సూచించారు అలాగే ప్రస్తుతం వరి పంటలో ఆశిస్తున్నటువంటి ఉల్లికోడు నివారణకు 3జి గుళికలు ఎకరాకు 10 కేజీల చొప్పున వేయాలని రీజెంట్, ఇండోక్సకార్బ మందులు పిచికారి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమములో వ్యవసాయ సహాయకులు పూసల శివ సుధాకర్, సునీత రైతులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-టంగుటూరు: 108 ఎంప్లాయిస్ యూనియన్ ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో 108 లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మరియు డి ఎం అండ్ హెచ్ ఓ సురేష్ కు బుధవారం 15 రకాల డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. 108లో పనిచేస్తున్న ఈఎంటి, పైలెట్ అందరిని వైద్య ఆరోగ్య శాఖలో ఎంప్లాయిన్ గా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. 2017 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం జీవో నెంబర్ 49 ద్వారా 4000 రూపాయలు పెంచి నేరుగా చెల్లించేవారు ఆ జీవోను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. 108 లో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు వార్షిక ఇంక్రిమెంట్లు ఈఎస్ఐ పీఎఫ్ బ్యాలెన్స్ గ్రాటివిటీ ఇతర బకాయిలన్నింటినీ ఒకే మొత్తంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. సహజ మరణం ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగులకు 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దర్గా మస్తాన్ వలీ ప్రధాన కార్యదర్శి బి లింగారెడ్డి పాల్గొన్నారు.

రైతులు పశుగ్రాసాన్ని సాగు చేయాలి

కేలం ఇంద్ర భూపాల్‌రెడ్డి

విశాలాంధ్ర-వెలిగండ్ల : కూటమి ప్రభుత్వం రైతులను, పాడి- పారిశ్రామిక ప్రోత్సహించేందుకు పశుగ్రాసంపై దృష్టి సారించేందని, పశుగ్రాసం పెంచేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సంవత్సరం పాటు రైతులకు గడ్డి పెంపకంకి వివిధ రూపాల్లో నగదు ప్రోత్సాకం అందిస్తుందని టిడిపి కనిగిరి నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకట్రెడ్డి అధ్యక్షతన రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ పథకం నీరుగారిపోయిందని, మరలా టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఈ మేరకు రైతులను ఆర్థికంగా చేయూతనందించే నిర్ణయం తీసుకొని దానికి సంబంధించిన జీఓను జారీ చేశారని అందులో భాగంగా కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నియోజకవర్గ రైతులు. వినియోగించు కునే విధంగా ఏర్పాటు చేశారని తెలిపారు. 5 ఎకరాల లోపు భూమి కలిగిన యస్.సి. యస్.టి కుటుంబాలు,చిన్న సన్నకారు రైతులుకి, వ్యక్తిగతంగా రైతులు 10 సెంట్లు నుండి 50 సెంట్లు వరకు సాగు చేసుకోవచ్చని, రైతులు జాబ్ కార్డు, పొలం 1బి జిరాక్స్, బ్యాంక్ పాస్ బుక్, రేషన్ కార్డు జిరాక్సు తీసుకొని స్థానికంగా ఉన్న పస్సు వైద్యాధి కారిని సంప్రదించాలన్నారు, ఈ కార్యక్రమంలో కర్నాంటి భాస్కర్ రెడ్డి, కొండు శ్రీనువాసులరెడ్డి, ముక్కు వెంకటేశ్వర రెడ్డి, సుంకరి కృష్ణయ్య రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలతో రైతుల్లో ఆందోళన

విశాలాంధ్ర-ముండ్లమూరు : ట్రాన్స్ఫార్మర్ చోరీలు జరుగుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నూజిల్లపల్లి గ్రామానికి చెందిన రైతులు ఆలా వెంకటస్వామి, మంచా శ్రీనివాసరావు, చుక్కా బ్రహ్మయ్య లుపొలంలో ఏర్పాటు చేసుకున్న 16 కె.వి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చోరీకి గురి కావడంతో రైతులు ఆందోళన చెందారు. పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి చూడగా ట్రాన్స్ఫార్మర్ కనిపించలేదు. దగ్గరకు వెళ్లి చూసేసరికి ట్రాన్స్ఫార్మర్ పగలగొట్టి అందు లోని రాగి వైరును దోచుకు వెళ్లినట్లు గుర్తించారు. దీంతో ఆందోళన చెందిన రైతులు ముళ్ళమూరు విద్యుత్ సబ్‌స్టేషన్కు వచ్చి విద్యుత్తు అధికారులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర-ముండ్లమూరు : రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు మండలంలోని ఉమామహేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ పి తిరుపతి స్వామి తెలిపారు. జిల్లాలోని చీమకుర్తిలో జరిగిన జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో గెలిచి రాష్ట్రస్థాయికి ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు. అండర్ 14 బాలికల విభాగంలో సిహెచ్ మాధవి, ఎన్ ప్రణతి, బి భావన, బి షర్మిల, అండర్ 14 బాలుర విభాగంలో కమలాకర్, అండర్17 బాలికల విభాగంలో సిహెచ్ పుష్పారేణుక, కే మహేశ్వరి, కే శ్రావణి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

వైసీపీ కార్యకర్తలను పరామర్శించిన దద్దాల, గంగాసాని

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని రఘునాథ పురం గ్రామానికి చెందిన కోనేటి కృష్ణయ్య, బొట్లగూడూర్ గ్రామానికి చెందిన బాల బోయిన కోటేశ్వ రరావులను కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్, మండల వైసీపీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డిలు బుధవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి చప్పిడి సుబ్బయ్య జిల్లా పార్టీ సీనియర్ నాయకులు ఒమేగా రామిరెడ్డి, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ బుజ్జి, మండలం బూత్ కమిటీ అధ్యక్షులు గట్ల విజయభాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ పోలినేని శీను బొట్లగూడూరు ఉపసర్పంచ్ రవీంద్ర, అంబటి కొండారెడ్డి, కనిగిరి నాయకులు రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ స్వర్ణ ఏడుకొండల రెడ్డి రామకృష్ణ, పోలినేని చిన్న, శ్రీను, మోహన్, మహేంద్ర, కోటపాటి శ్రీను, తురక మహ లక్ష్మయ్య, దేవరకొండ మాలకొండయ్య, రాజేంద్ర, వెంగళరావు, మహేష్, దావీదు, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం ఉపవిద్యాశాఖ అధికారి బాధ్యతలు



విశాలాంధ్ర-పుల్లలచెరువు : బుధవారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఇటీవల మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన బి.సామ్యూల్ జాన్‌ని, మండల విద్యాశాఖ అధికారి-2 యం ఇందిరా ప్రసాద్‌లను భవిత సెంటర్ తరపున సన్మానించడం అయినది. మండల ఐఆర్పి టి.తేజ రూపిని, ఫిజియోథెరపిస్ట్, వి.అంకారావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితం..

ముగిసిన మినీ బ్యాడ్మింటన్ పోటీలు

విశాలాంధ్ర-ఒంగోలు : లార్డ్ కృష్ణ ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 11 బాల బాలికల మినీ బ్యాడ్మింటన్ పోటీలు ఉత్కంఠ భరితంగా ముగిశాయి. చిన్నారులు నువ్వా నేనా అన్నట్లు చివ్వర పిడుగుల్లా పోటీలు పడ్డారు. చిన్నారుల అద్వితీయ ప్రదర్శన ప్రేక్షకులను అబ్బుర పరిచింది. బాల బాలికలు పదునైన షాట్స్, స్మాష్‌లతో తమ ప్రతిభను చాటారు. ముఖ్యంగా బాలికలు బ్యాట్‌తో నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడాభిమానుల మన్ననలు పొందారు. చివరి రోజు ఉదయం సెమీ ఫైనల్స్ తరువాత ఫైనల్స్ హోరాహోరీగా జరిగాయి. అండర్ 11 బాలుర సింగిల్స్ ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురంకు చెందిన ఏ. హర్షిత్, విశాఖపట్నంకు చెందిన కే.మోజెష్ పై విజయం సాధించారు. అండర్ 11 బాలికల సింగిల్ ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణ జిల్లాకు చెందిన కియా, ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్.కే రబియా పై విజయం సాధించారు. బాయ్స్ డబుల్స్ ఫైనల్ మ్యాచ్‌లో ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్.కే ఆఫన్, ఎస్.కే యాశీర్, ఈస్ట్ గోదావరికి చెందిన శ్రీ రామ్ సహంత్, కే.కార్తీక్ సూర్య రాయ్‌పై విజయం సాధించారు.బాలికల డబుల్స్ ఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నం కు చెందిన ఎలియన్ ప్రియాంక్, శ్రీ ప్రవ్య, ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్ కే రబియా, కృష్ణ జిల్లాకు చెందిన కే.అధ్య పై విజయం సాధించారు. మూడు రోజుల పాటు క్రీడాభిమానులు సందడితో లార్డ్ కృష్ణ స్టేడియంలో పండగ వాతావరణ నెలకొంది.చిన్నారుల కళ్ళు చెదిరే షాట్స్ ప్రేక్షకులను కట్టిపడేశాయి. పోటీలను తిలకించడానికి క్రీడాభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఫైనల్ మ్యాచ్‌లో గెలిచిన రన్నర్స్, విన్నర్స్‌కు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమి చైర్మన్ శిద్దా సుధీర్ కుమార్. అభినందనలు తెలిపారు. విన్నర్స్, రన్నర్స్‌కు అకాడమి ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీ కృష్ణ ట్రోఫిలతో పాటు ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సర్టిఫికెట్స్ అందచేశారు. ఈ సందర్భంగా అద్దంకి మురళీ కృష్ణ మాట్లాడుతూ ఈ మ్యాచ్ లో గెలుపొందిన విజేతలు జాతీయ స్థాయి టోర్నమెంట్ కు క్వాలిఫై అయినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో అండర్ 11బాల బాలికల మినీ బ్యాడ్మింటన్ పోటీలు లార్డ్ కృష్ణ అకాడమి లో నిర్వహించడం చాలా సంతోషంగా వుందని, పోటీలలో పాల్గొన్న చిన్నారులకు, తల్లి తండ్రులకు, క్రీడాభిమానులకు, కోచ్‌లకు, అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలియచేశారు. ముందు మరిన్ని జాతీయ బ్యాడ్మింటన్ పోటీలు లార్డ్ కృష్ణ అకాడమిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రైతు సేవా కేంద్రాల్లో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని కాట్రగుంట గరిమెన పెంట, గ్రామాల రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులకు బుధవారం మండల వ్యవసాయ అధికారి కే ప్రసన్న రంగలక్ష్మి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రబి సీజన్లో సాగుచేసిన మినుము, వరి ,శనగ జొన్న ,మిరప, పంటలకు పసల బీమా చెల్లించినట్లయితే భీమా పథకం వర్తిస్తుందని మీసేవ కేంద్రాల్లో ప్రీమియం చెల్లించాలన్నారు. ఆయా గ్రామాల్లోని మినుము పంటను పరిశీలించి, మినపంటపై పల్లాకు తెగులు, తెల్ల దోమ ఆశించినట్లు గుర్తించారు. దాని నివారణకు చర్యలు గురించి రైతులకు తెలియజేశారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచనలు సలహాలు చేశారు .పెదరికట్ల పశువైద్యాధికారి కే శ్రీకాంత్ మాట్లాడుతూ 21వ పశుగణన జరుగుతుందని రైతులు తమ పశువులు వివరాలను సిబ్బందికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపి కోఆర్డినేటర్ ఓబయ్య, ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు కే శిరీష, జెడ్పిటిసి సభ్యుడు లక్కీ దాసరి ఏడుకొండలు సర్పంచ్ రామిరెడ్డి, గురవయ్య ఏఈఓ విక్రమ్ ఆ గ్రామాలు రైతులు పాల్గొన్నారు.

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బైరెడ్డి, దారపనేని

విశాలాంధ్ర-పామూరు : ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌ను క్యాంపు కార్యాలయంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, గద్దె గంగయ్య చౌదరి, కంబాలదిన్నె మాజీ సర్పంచ్ గోళ్ళ కేశవులు నాయుడు, పాలపర్తి వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడులో నిర్మితమై ఉన్నా నక్కలగండి ప్రాజెక్ట్ పామూరు మండలంలోని కొన్ని గ్రామాలు, నెల్లూరు జిల్లా లో కొన్ని మండలాల ఆయకట్టు రైతులకు సాగునీరు, త్రాగునీరు అందిస్తున్నది. నక్కల గండి ప్రాజెక్టు కు నిధులు మంజూరు చేయించి, ప్రాజెక్టు తూములు, కాలువలు ఆధునీకరించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి దారపనేని చంద్రశేఖర్ తీసుకెళ్లారు. స్పందించిన శాసనసభ్యులు కాకర్ల సురేష్ సంబంధిత అధికారుల ద్వారా ప్రతిపాదనలు తెప్పించి నిధులు తీసుకొస్తానని తెలిపారని దారపనేని పేర్కొన్నారు.

పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా వీరయ్య..?

- మంత్రి లోకేష్‌తో మంతనాలు
- మండల వాసికి మరోసారి దక్కే ఛాన్స్

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : పీడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి మరోసారి నాగులుప్పలపాడు మండల వాసికే దక్కేనా..? ప్రస్తుత రాజకీయ పరిణామాలు ఔననే అంటున్నాయి. నాగులుప్పలపాడు మండలం నుంచి గతంలో కాంగ్రెస్ హయాంలో ఈదర మోహన్ బాబు చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత మారిన పరిణామాల నేపథ్యంలో 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో ఆయన టీడీపీ వైపే మొగ్గుచూపి ఆ పదవిలో కొనసాగారు. ఇక 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ ఐదేళ్లు పీడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవిని నామినేట్ చేస్తూ వచ్చింది. ఇక సొసైటీ అధ్యక్షులుగా కూడా త్రిమెన్ కమిటీలు ఏర్పాటు చేసి వారిలో ఒకరిని అధ్యక్షులుగా చేసింది. దీంతో వైసీపీ ఐదేళ్ల పాలన సీల్డ్ కవర్ అధ్యక్షులు, చైర్మన్‌గా కొనసాగారు. ప్రస్తుతం టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చింది. ఈ పర్యాయం ఎన్నిక నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఆశావహులు చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు. ఈ పోటీకి ముందు వరసలో నాగులుప్పలపాడు మండలం మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ కోసం పోటీ పడే వారిలో ఒంగోలుకు చెందిన ప్రముఖ వైద్యుడు సీతారామయ్య, వీరయ్య చౌదరి పేర్లు ప్రముఖంగా ఉన్నట్లు తెలిసింది. వీరిలో ఎన్నికల నిర్వహణ అనుభవం, బ్యాంకుల పనితీరుపై అవగాహన, రైతులతో సత్సంబంధాల విషయంలో వీరయ్యకు మంచి పట్టు ఉంది. ఇక రాజకీయంగానూ, వివాదస్పదమైనప్పటికీ, గుర్తింపు ఉంది. కీలకమైన గత ఎన్నికల సమయంలో టీడీపీని వెన్నంటే ఉండడం, వర్గ రాజకీయాలకు ఒకింత దూరంగా ఉండడం ఆయనకు కలిసొస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆయన పీడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి కోసం పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఇటీవల మంత్రి లోకేష్ చెంతకు వెళ్లి తన అభ్యర్థనను తెలియజేసినట్లు సమాచారం. దీంతో మరోసారి నాగులుప్పలపాడు మండలం వాసికే ఒంగోలు పీడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి దక్కనుందా! అని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఉచిత ఇసుకకు ఎడ్లబండ్లను అనుమతించాలి

- ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు ప్రభుత్వ అధికారులు అమలు చేయక పోవటాన్ని నిరసిస్తూ బుధవారం రేపల్లె ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.రెవెన్యూ,పోలీస్ అధికారుల, వేధింపులు ఆపాలిని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్ ఆందోళన వ్యక్తం చేశారు.సీఐటీయూ ఆధ్వర్యంలో ఎడ్లబళ్ల ముఠా కార్మికులు ఆర్డీవో,డిఎస్పీ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందచేశారు.ఆర్డీవో ఆఫీస్ ఎదుట బైఠాయించిన ఎడ్ల బండ్ల ముఠా కార్మికులు ఉచిత ఇసుకను అనుమతించాలని, పోలీసు, రెవెన్యూ అధికారుల వేధింపులు ఆపాలని,నినాదాలు చేశారు.సిహెచ్. మణిలాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుకను అమలుకోసం స్పష్టంగా జీవోలో ఎడ్లబళ్ల ద్వారా ఇసుక తీసుకువేలె వారిని ఆపవద్దని ముఖ్యమంత్రి పదేపదే చెబుతున్నప్పటికీ రేపల్లె నుండి వెళ్లి ఎడ్లబళ్ల ద్వారా ముఠాకార్మికులు కృష్ణానదిలో నుండి ఓలేరు తదితర లంకగ్రామాలు నుండి ఇసుకను తీసుకువస్తుంటే ఓలేరు వద్ద,భట్టిపోలు పోలీసులు, రెవెన్యూ అధికారులు పెనుమూడి వద్ద,పోలీసులు ఎడ్లబండ్ల ఆపి ఇసుకను రోడ్డుమీద పారబోపిచ్చటం, బెదిరించటం నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారు.గత పది రోజుల నుండి రేపల్లెలోకి ఇసుక ఎడ్లబండ్లని అనుమతించకపోవడంతో ఇసుక ముఠాకార్మికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.వెంటనే రేపల్లె ఆర్డీవో సంబంధిత రెవెన్యూ అధికారులకు,రేపల్లె డిఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులకు ఉచిత ఇసుకను తరలించుకోవడానికి అనుమతించాలని ఆ విధంగా ఆదేశాలు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.లేని నేపథ్యంలో ఇసుక తరలించే ఎడ్లబండ్లలను ఎక్కడ ఆపితే అక్కడే ఎడ్లబండ్ల ద్వారా బైఠాయించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.ఈ ధర్నా కార్యక్రమంలో ఎడ్లబండ్ల ఇసుక ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు జి.రాఘవయ్య, పి.వినోద్,ఎస్.గణేష్, టి.రామయ్య సీఐటీయూ రేపల్లె నాయకులు భవన నిర్మాణ కార్మిక సంఘంనాయకులు జె.ధర్మరాజు, కె.ఆశీర్వాదం,బి.ఆగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

ఐలవరంలో ధర్మరక్షా దినోత్సవం

విశాలాంధ్ర - రేపల్లె : సమరసత సేవా ఫౌండేషన్ నిర్వహిస్తున్న ధర్మ రక్ష దినోత్సవాల్లో భాగంగా బుధవారం భట్టిప్రోలు మండలం ఐలవరంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో ధర్మ రక్షా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు మాట్లాడుతూ హిందూధర్మ రక్షణ కోసం జీవితాంతం కృషిచేసిమతఛాందస్తవాదుల కాల్పులతో మృతి చెందిన లక్ష్మణానంద సరస్వతీస్వామి సంస్మరణ దినాన్ని ధర్మరక్ష దినోత్సవంగా జరుపుకోవటం జరుగుతుందని, అదేవిధంగా మన ధర్మ రక్షణ కోసం ముమ్మిడివరం పెద్ద బాలయోగి,పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి,పాకలపాటి గురువు మలయాళ స్వామి తదితరులు సంఘసంస్కర్తలుగా సనాతన హైందవ ధర్మ దార్శినికులుగా పనిచేశారని,వారిని స్మరించుకుంటూ ధర్మరక్ష దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ కార్యకర్తలు వామనపలి కోటేశ్వరరావు,రామిశెట్టి సత్యమోహనరావు,అర్చకులు శేషు,ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులపై అవగాహన

విశాలాంధ్ర - వేటపాలెం : మండలంలోని దేశాయిపేట-1,వేటపాలెం-1 గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం జరిగినది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సమక్షంలో సాయిల్ హెల్త్ కార్డ్ రైతులకు పంపిణీ చేశారు.సాయిల్ హెల్త్ కార్డ్ ఫలితాల ఆధారంగా పొలాలకు ఎరువులు ఎలా ఉపయోగించుకోవాలి అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు.అదే విధంగా వరి పొలాన్ని సందర్శించి, ఎం.ఓ.పి, ఫాస్ఫేట్ వంటి బలం ఎరువులను వాడవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో వీఏఏలు,ఏఈవో రైతులు పాల్గొన్నారు.

రేపల్లెను సుందర పట్టణంగా తీర్చిదిద్దుదాం

- డీఎస్పీ శ్రీనివాసరావు

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలో రోడ్ల మీద కానీ, ఖాళీ స్థలాలలో చెత్త చదరాన్ని వేయకుండా,అత్యంత సుందర పట్టణంగా రేపల్లెను తీర్చిదిద్దుదామని,ఇంటింటికీ వచ్చే పారిశుధ్య కార్మికుల చెత్త వాహనాలకు చెత్తను అందించి,పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు పుర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.బుధవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ దగ్గర్లోని ఇండియన్ బ్యాంకు బజార్ మొదట్లో ఉన్న చెత్త పాయింట్‌ను శుభ్రం చేసి అక్కడ మొక్కలు నాటారు. ప్రతి రోజు వేలమంది తిరిగే ఇండియన్ బ్యాంకు బజార్‌లో వేసే చెత్తను ఎప్పటికప్పుడు మునిసిపల్ కార్మికులు శుభ్రం చేస్తున్నప్పటికి,మరల ఆ ప్రాంతం చెత్తతో నిండి ఉండటం వలన ప్రజలు అసౌకర్యానికి గురి కావటంతో,మునిసిపల్ అధికారులు,సానిటరీ వర్కర్లు ఈ ప్రాంతంను శుభ్రం చేసి,మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ,కమీషనర్ కె.సాంబశివరావు,వైస్ చైర్ పర్సన్స్ జి. ప్రశాంత్ కుమార్,టి.కాశీవిశ్వనాధ గుప్త, శానిటరీ ఇనిస్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు,రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కోడె గౌరీ శంకర్,శానిటేషన్ సెక్రెటరీ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగర హారతి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల గడియార స్తంభం సెంటర్‌లో ఉన్న శ్రీ వీరరాఘవ స్వామి దేవస్థానం వద్ద విశ్వహిందూ పరిషత్ చీరాల శాఖ ఆధ్వర్యంలో సామూహిక సాగర హారతి కార్యక్రమానికి సంబంధించిన గోడ పోస్టర్లను,కరపత్రాలను అన్నదానం చిదంబరం శాస్త్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చీరాల మండలం వాడరేవు గ్రామంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన జరిగే సాగర హారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక జిల్లా సహ సంయోజక్ బండారు జ్వాల నరసింహం, చీరాల నియోజకవర్గం ప్రముఖ్ తాడివలస దేవరాజు,కార్యవర్గ సభ్యులు, సభ్యులు,హిందూ బంధువులు,చీరాల గోపరిరక్షణ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

విశాలాంధ్ర - పర్చూరు : పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన శనగ,జొన్న, మొక్కజొన్న,పెసర,మినుము తదితర పంటలను రైతులు వేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభైరు మోహనరావు తెలిపారు.బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం పర్చూరు, ఉప్పుటూరు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి రామ్మోహనరెడ్డి అధ్యక్షతన జసరిగింది.ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డిసెంబర్ 15 లోపు రైతులు ఆయా పంటలపై బీమా సొమ్మును చెల్లించాలని తెలిపారు.వరికి డిసెంబర్ 31 లోపు కట్టుకోవాలని తెలిపారు. వీఏఏలు ఆశా,సౌమ్య,అరుణ, ఫిలిప్, శీకాంత్,టీడీపీ మండల పార్టీ కన్వీనర్ శంషుద్దీన్,శివ నాగేశ్వరరావు,సుబ్బయ్య,పోతురాజు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి 25 కుర్చీలు వితరణ

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ప్రభుత్వం చిన్నారులు బాలింతలు గర్భవతుల కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు స్థానిక దాతలు సహకారం అందిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు అని నిర్వాహకురాలు దేగల వెంకటేశ్వరమ్మ అన్నారు.సోమవారం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారుల్లో శ్రేయాన్స్ జన్మదినం సందర్భంగా చిన్నారి తల్లి దండ్రులు దేగల గోపికృష్ణ దంపతులు 25 కుర్చీలను బహుకరించారు. చిన్నారులకు పలకలు స్వీట్స్ పంపిణీ చేశారు.

108 సర్వీస్‌ను ప్రభుత్వమే నిర్వహించాలి

విశాలాంధ్ర - అద్దంకి : 108 సర్వీస్‌ను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని 108 సర్వీస్ బాపట్ల జిల్లా కమిటీ అధ్యక్షులు మహేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిబ్బంది ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం బాపట్ల జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయమ్మకు సమ్మె నోటీసు అందజేశారు.ఈనెల 25వ తేదీ లోగా తమ సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని సమ్మె నోటీసులో పేర్కొన్నారు.కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి హరిబాబు,యూనియన్ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు అవలంబించాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంభించడంతో గులాబీ రంగు పురుగును సమర్థవంతంగా నివారించవచ్చని వ్యవసాయ శాఖ అధికారి మేరమ్మ అన్నారు. మండ లంలోని తనుబోద్దువారిపాలెం,మున్నంగివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి పంటలో కనిపించే గులాబీ రంగు పురుగు నివారణ గురించి రైతులకు వివరించారు.రైతులు పొలంలో గుడ్డి పూలు, కాయపై భాగంలో పురుగు బయటకు వచ్చి గుండ్రటి చిన్న రంధ్రం,కాయ తోడిమ,మధ్య గోడలపై గుండ్రటి రంధ్రం ఏర్పడితే,గుడ్డి పత్తి,రంగు మారిన పత్తి లక్షణాలు ఉన్నచో గులాబీ రంగు పురుగు ఉనికిని నిర్ధారించవచ్చని తెలిపారు. వ్యవసాయ సహాయకులు సుదర్శన్, ఏపీ సిఎన్ఎఫ్ చెందిన కోటి బాబు, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో చేపట్టవలసిన అభివృద్ధి ప్రణాళిక రేపు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ,సర్పంచులు,ఎంపీటీసీలు,జడ్పీటీసీలు వివిధ శాఖల అధికారులకు ఒకరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు.ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 వరకు రెండు గ్రూపులుగా విభజించి శిక్షణ ఇవ్వన్నట్లు ఆమె తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంకు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

మధుమేహం వ్యాధిపై జాగ్రత్తలు పాటించాలి

వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కొప్పుల సిద్ధార్థ్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : అంతర్జాతీయ మధుమేహం వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన నియమాలు పట్ల బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కొప్పుల సిద్ధార్థ్ పలు సూచనలు చేశారు.వయసుతో సంబంధం లేకుండా చిన్న,పెద్ద,ఆడ మగ అందరికీ వస్తున్న వ్యాధి షుగర్ వ్యాధి శాస్త్రీయ ఆహారాలు స్వీకరిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మనిషి యొక్క జీవనశైలి కొనసాగాలని సూచించారు.కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల డయాబెటిస్ కారణంగా జరిగే నష్టాన్ని తగ్గించుకోవచ్చుని డయాబెటిస్ గురించి ఎంతో మందిలో కొన్ని సందేహాలు,అపోహలు ఉన్నాయన్నారు. టేస్టీ చాక్లెట్లు,కుకీలు, బిస్కెట్లు మొదలైనవి మార్కెట్లో లభిస్తూ ఉంటాయి.వాటిని తినే వారి సంఖ్య ఎక్కువగానే ఉందన్నారు. డయాబెటిక్ పేషెంట్లు కూడా ఇలాంటి ఆహారాలకు దూరంగా ఉండాలని వాటిలో కేలరీలు, సంతృప్త కొవ్వులు అధికంగా ఉంటాయన్నారు. కృత్రిమ స్వీటెనర్ చెడు ప్రభావాలను చూపిస్తుందన్నారు.

9వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యటన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని సామాజిక పర్యటనలో భాగంగా 9వ వార్డులో మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి పర్యటించారు. చిల్లర గొల్లపాలెంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించి వాడుకలో లేని రీడింగ్ రూమ్‌ను పరిశీలించారు.వెంటనే బాగు చేసి అందుబాటులోకి తీసుకొని రావాలని ఇంజినీరింగ్ సిబ్బంది ఆదేశించారు.మంచినీటి పైపులైను లేనందున తాగు నీటికి ఇబ్బంది కలుగుతుందని వార్డు ప్రజలు కమిషనర్‌కి తెలుపగా తక్షణమే అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు.18వ సచివాలయం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఇస్లాంపేటలో ఉన్న ఈద్గాను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు అసిస్టెంట్ ఇంజనీర్ ప్రసాద్,రెవెన్యూ అధికారి షేక్ జబ్బార్ ఉన్నారు.

కాంప్లెక్స్ లెవెల్ పోటీల్లో ఫరూక్‌కు ప్రథమ స్థానం

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండలంలోని చింకపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12వ తేదీ మంగళవారం జరిగిన కాంప్లెక్స్ లెవెల్ స్పోర్ట్స్ పోటీలలో భాగంగా నిర్వహించిన మ్యూజికల్ చైర్ పోటీలో కోవూరి వారిపాలెం ఉర్దూ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ ఫరూక్ మొదటి స్థానంలో నిలిచాడు.ఈ సందర్భంగా ఆ విద్యార్థి సాధించిన బహుమతి, ప్రశంస సర్టిఫికెట్లను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరీముల్లా బేగ్ విజేతకు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. మరెన్నో విజయాలు సాధించాలని అలాగే పాఠశాలకు,గ్రామానికి మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని అయన ఆకాంక్షించారు.

సందడిగా ఎల్ఐసి కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ సతీష్ బాబు టీము ఏజెంట్లు కార్తీక సమారాధన బుధవారం పేటేరు రోడ్‌లోని బావాజీ తోటలో సందడిగా కోలాహలంగా ఏజెంట్లు వారి కుటుంబ సభ్యులు కలిసి ఘనంగా కార్తీక వన సమారాధన నిర్వహించారు.ఈ సందర్భంగా ఏజెంట్లతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ సతీష్ బాబును,దృశ్యాలు వాలు పూల మాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు.ఏజెంట్లు వారి కుటుంబ సభ్యులు కార్తీక వన సమారాధన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

ఆక్రమణకు గురైన పొలం పరిశీలన

విశాలాంధ్ర - రేపల్లె : బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెసర్లంక గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యన్నం సురేష్ పొలాన్ని ఆక్రమించి పొలానికి మధ్యగా జూన్ నెలలో రోడ్డు వేయటంతో సురేష్ రెవెన్యూ అధికారులకు,పోలీస్ అధికారులకు,విన్నవించుకున్నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో బాధితుడు రాష్ట్ర ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించగా ఎస్సీ కమిషన్ చైర్మన్ స్వయంగా బాధితుని కుటుంబాన్ని పరామర్శించి పొలంలో వేసిన రోడ్డును పరిశీలించి సురేష్‌కి అన్యాయం జరిగిందని గ్రహించి,తక్షణమే రోడ్డు తీసివేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించటంతో రెవెన్యూ అధికారులు రోడ్డును తొలగించారని మరలా ఆగస్టు 25వ తేదీన అక్రమంగా ఒక సమూహంగా వచ్చి సురేష్‌ని వారి కుటుంబ సభ్యుల్ని బెదిరించి దుర్భాషలాడి తన పొలం మధ్యలో రోడ్డు వేయడం జరిగింది.ఇలా రోడ్డు వేశారు అని పోలీస్ అధికారులకు,రెవెన్యూ అధికారుల దృష్టికి అర్జీ రూపంలో తీసుకు వెళ్లి పలుమార్లు వాళ్ళ ఆఫీసుల చుట్టూ తిరిగిన ఫలితం లేకపోవడంతో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ నేషనల్ కమిటీ వారి దృష్టికి తీసుకురావడంతో బుధవారం పెసర్లంక గ్రామంలో సురేష్ పొలంలో అక్రమంగా వేసిన రోడ్డును పరిశీలిస్తే దౌర్జన్యంగా అక్రమముగా రోడ్డు వేయటం జరిగిందని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిలర్ పీపుల్ నేషనల్ చైర్‌పర్సన్ డాక్టర్ జ్ఞాన సుందరి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓ దళిత కుటుంబానికి చెందిన యన్నం సురేష్‌ను కొంతమంది అగ్రవర్ణ పెత్తం దారులు రాజకీయ నాయకుల అండదండలతో ఒక గ్రూపు సమూహంతో వచ్చి భయభ్రాంతులకు గురిచేసి వారి పొలాన్ని ఆక్రమించి పొలం మధ్యలో గుండా రోడ్డు వేయటం చాలా దారుణమైన విషయమని సురేష్ పోలీసు అధికారులకు, రెవెన్యూ అధికారులకు, పలు సార్లు అర్జీ రూపంలో విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోపోవటం చాలా దారుణమైన విషయమని దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి ఈ పొలంలో గుండా అక్రమంగా వేసినటువంటి రోడ్డును తొలగించే విధంగా చర్యలు చేపట్టి అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని యన్నం సురేష్‌కి న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు,హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రటరీ కాసుల పద్మ,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భక్తుల గీత,రాష్ట్ర మీడియా ఇంచార్జ్ కారుమూరు హానొక్, ప్రముఖ న్యాయవాది యరగళ్ళ సాంబశివరావు,అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.జి అరుణ్ శాస్త్రి,గోలి శ్రీనివాసరావు, పోలిమెట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నత్రజనితో పాటు పొటాష్‌ను వాడాలి

విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని కర్లపాలెం,బుద్ధాం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సుమంత్ కుమార్ మాట్లాడుతూ వరి చిరుపొట్ట దశలో ఉన్నందున నత్రజని ఎరువుతో పాటుగా పొటాష్ ఎకరాకు 20 కేజీల చొప్పున తప్పనిసరిగా వేసుకుంటే గింజ నాణ్యత, దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందని సూచించారు.వరి పునరుత్పత్తి దశలో పొలంలో నీరు ఉండేలా చూసుకోవడం ముఖ్యమని తెలిపారు.ఈ వాతావరణంలో అగ్గి తెగులు సోకే అవకాశం ఉంటుందని,తెగులు ఉధృతి తక్కువ ఉన్నప్పుడు ట్రైసైక్లజోల్ -120 గ్రాములు ఎకరాకు ఎక్కువ ఉధృతి ఉన్నప్పుడు ఫ్యూజివన్-300 మిలి లేదా కాసు-బి 500 మిలీ పిచికారీ చేసుకోవాలని సూచించారు.ఆకు చివరి కొనలు ఎర్రబడడానికి ప్రధానంగా నల్లి సోకడం/ పొటాష్ లోపం కారణం కావచ్చని,బెట్ట పరిస్థితులు ఉన్నప్పుడు నల్లి సోకుతుందని తెలిపారు.నల్లి నివారణకు ప్రొఫెనోఫోస్ 400 మి.లి ఎకరాకు లేదా ప్రోపర్గైట్ -400 మి.లి పిచికారీ చేయాలని సూచించారు.సుడి దోమ నివారణకు పైమెట్రోజైన్ (చెస్) లేదా డైనోటెఫ్యూరాన్ 80 గ్రా. ఎకరాకు పిచికారీ చేసుకోవాలని తెలిపారు.దోమ ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రమే పెక్సలాన్ 94 మి.లి ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. రబీ సీజన్‌లో వేసుకొనుట కొరకు వీ.బి.ఎన్-8 మినుము చిరు సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు.రబీలో పంట వేసిన వారు నమోదు చేయించుకోవడానికి ఈ నెల 17వ తేదీ నుండి సైట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు భ్రమరాంబ,బాజి,రైతులు పాల్గొన్నారు.

మొహమ్మద్ షాజద్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా 2024 ఉర్దూ అకాడమీ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు పిట్టలవానిపాలెం మండలం చందోలులోని రసూల్ పేట మండల పరిషత్ ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొహమ్మద్ షాజద్ ఎంపికయ్యారు.ఈ సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా మొహమ్మద్ షాజద్ రాష్ట్రస్థాయి ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న మొహమ్మద్ షాజద్‌ను మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు,ఉపాధ్యాయులు, పలువురు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

హెచ్ఐవి వ్యాధి నియంత్రణపై అవగాహన

విశాలాంధ్ర - మార్టూరు : హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ నిర్మూలన కొరకు విద్యార్థులు కృషి చేయాలని,విద్యార్థి దశ నుండే సమాజ సేవలో భాగస్వాములు కావాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ పేర్కొన్నారు.బుధవారం మార్టూరు మండలం కోనంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాపట్ల జిల్లా హెచ్ఐవి,ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన సంస్థ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన కొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చేపట్టిన నీకు తెలుసా ఐఇసి అవగాహన సదస్సును పాఠశాలలు ఏర్పాటు చేయటం జరిగింది.పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ హెచ్ఐవి,ఎయిడ్స్ వ్యాధి తెలియకుండానే రోజుకి సమాజంలో పెరుగుతుందని దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని రక్త మార్పిడిల ద్వారా హెచ్ఐవి,ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు శృంగారంలో పాల్గొన్నప్పుడు పచ్చబొట్ల ద్వారా అపరిశుభ్రత సూదుల ద్వారా వ్యాధి సోకుతుందని అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో హెల్ప్ టిఐ మార్టూరు ఔట్రీచ్ వర్కర్స్ కె.దుర్గా, జె.రూతు పిఈలు సల్మారుతూ ప్రమీల రమ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్గి తెగులుపై అప్రమత్తం

విశాలాంధ్ర - అద్దంకి : వరిలో అగ్గి తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు.బుధవారం కలవకూరు,సింగరకొండపాలెం గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ వరిలో ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అగ్గి తెగులుకు,రసం పీల్చు పురుగులకు అనుకూలంగా ఉందని దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 160 గ్రాములు ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు మస్తాన్‌రావు, సాయిబాబులు పాల్గొన్నారు.

బంగారు బాలోత్సవాలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-తాళ్లూరు : బంగారు బాలోత్సవాలను విజయ వంతం చేయాలని ఎంపీడీఓ సుందర రామయ్య కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ సుందర రామయ్య మాట్లాడుతూ వారం రోజుల పాటు బంగారు బాల్యానికి శ్రీకారం- బాలోత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. మన హక్కులు తెలుసుకుందాం, మన కోసం మనం, మా పిల్లలు బాధ్యత, సదా బాలల సేవలో ... మా కళలు - మాస్వ ప్నాలు, చేయి చేయి కలుపుదాం.. బంగారు బాల్యం అందిద్దాం అనే ఇతి వృత్తాలతో మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించాలని కోరా రు.

0-18 ఏళ్ల బాలల హక్కులు పరిరక్షణ వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసేలా సంబంధిత శాఖ అధికారులతో గ్రామ, మండల స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రాప్ అవుట్, బాల కార్మిక,బాల్య వివాహా లు, అనారోగ్యం బారిన పడిన బాలల ను గుర్తించి ప్రతి ఒక్కరి పరిస్థితికి తగినట్లు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ రావు, ఎంఈఓ-2 సుధాకర్ రావు, ఎఎస్సై మోహనరావు, ఎంపీఎం దేవరాజ్, ఐసీడీఎస్ సూపర్వైజర్ జ్యోతి ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడే మెన్ అండ్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని బండ్ల బాపయ్య హిందూ డిగ్రీ కళాశాలలో నేడు మెన్స్ అండ్ ఉమెన్స్ విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్,ఆంధ్ర కేసరి యూనివర్సిటీ సెలక్షన్స్ నిర్వహించ బడతాయని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సెలక్షన్స్ కి ఆంధ్ర కేసరి యూనివర్సిటీ అనుబంధ కళా శాలలు అయినటువంటి డిగ్రీ,పీజీ,ఫార్మసీ,బీఈడీ విద్యార్థులు పాల్గొనవచ్చని కళాశాల ప్రిన్సిపల్ తెలియజేశారు.

అఖిల భారత సహకార వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - బాపట్ల : 71వ అఖిల భారత సహకార వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ జె.వెంకట మురళి బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. జిల్లా సహకార అధికారి సిహెచ్ సంసోన్,జిల్లా సహకార ఆడిట్ అధికారి కాటసాని తిరుపాల్ రెడ్డి,అసిస్టెంట్ రిజిస్ట్రార్ మరకా రవికుమార్,గోగుల శ్రీనివాసులు,సహకార సిబ్బంది పాల్గొన్నారు.

శివలింగాలకు పూజలు

విశాలాంధ్ర - యద్దనపూడి : కార్తీక మాస పర్వదినాలు సందర్భంగా మండలంలోని పూనూరు గ్రామంలో ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు.1100 శివలింగాలను మట్టితో తయారు చేయించి,365 దీపాలతో కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళా భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని దీపోత్సవాన్ని తిలకించారు.గ్రామ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : గ్రామ పంచాయతీలలో మండ లంలో పలు గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులపై ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో నాసర్‌రెడ్డి తెలిపారు. బుధవారం దోర్నాలలోని ఎంపీడీవో ఆఫీస్ కార్యాలయంలో ఎంపీడీవో నాసర్ రెడ్డి అధ్యక్షతన అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వీఆర్వోలకు పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ సిబ్బందికి ఎంపిటీసీలకు శిక్ష తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం పోలయ్య, పంచాయతీ కార్యదర్శి రంగయ్య, మరియు సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

విశాలాంధ్ర-వెలిగండ్ల : కనిగిరి నియోజకవర్గంలో రిలయన్స్ సంస్థ సహకారంతో కూటమి ప్రభుత్వం కనిగిరి నియోజకవర్గం లో పామూరు ప్రాంతంలో ఏర్పాటు చేయబోతున్న రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంటు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి సహకారంతో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి బయోగ్యాస్ ప్లాంట్ కనిగిరి యువతకు ఉపయోగపడుతుందని ఉపాధి పెరుగుతుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకటసుబ్బారెడ్డి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్ కొనియాడారు ఈ క్రమంలో లోగోని బుధవారం అమరావతి గ్రౌండ్స్ నందు ఆవిష్కరించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఈ నెల14 వతేది నుండి మండలంలోని ఉప్పుగుండూరు నాగులుప్పలపాడు గ్రంథాలయాల్లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రందపాలకులు ప్రసాదు, శ్రీనివాసులు తెలిపారు 14వతేది నుండి 20వ తేది వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఈనెల 14వ తేది బాలల దినోత్సవం ప్రారంభ వేడుకలు, 15వ తేది పుస్తక ప్రదర్శన, 16వ తేది గ్రంథాలయ ఉద్యమ కారులను స్మరించుట, కవిసమ్మేళనాలు, సెమినార్లు, 17,18 వ తేదీలు విద్యార్ధి విద్యార్ధిని లకు వివిధ పోటీలు 19వ తేది మహిళా దినోత్సవం.20 వ తేది వారోత్సవాల ముగింపు వేడుకలు మరియు బహుమతి ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రతి స్కూల్ యాజ మాన్యం విద్యార్థిని విద్యార్థులను పంపాలని కోరారు.

నారుమాళ్ళ సస్యరక్షణపై అవగాహన

విశాలాంధ్ర-సింగరాయకొండ : సింగరాయ కొండ మండల పరిధిలోని పాకల మరియు ఊళ్ళ పాలెం గ్రామాల్లో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో సింగరాయకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల కుమారి మాట్లాడుతూ వరి పంటకు ఇన్సూరెన్సు చేయించుకోవటానికి డిసెంబర్ 31 వరకు గడువు ఉందని వివరించడం జరి గింది.ఈ కార్యక్రమానికి సింగరాయకొండ మండల వ్యవసాయ అధికారి, ఎ ఈ ఓ ,బి యఫ్ ఎ , జడ్ బి యన్ యఫ్ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

హిందూ స్మశాన వాటిక దురాక్రమణ

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని ముండ్లపాడు గ్రామంలో జరిగిన గ్రామసభలో ముండ్లపాడు టీడీపీ యువ నాయకుడు కురుకుందు సాంబశివ నాయుడు,గ్రామస్థులు కలిసి ముండ్లపాడు, బురుజుపల్లె వెంకటాపురం గ్రామాల్లో ఉన్న హిందూ స్మశాన వాటికలు దురాక్రమణకు గురయ్యాయని, వెంటనే దురాక్రమణలను తొలగించి ఆక్రమనదా రులపై చర్యలు తీసుకోవాలని గిద్దలూరు తహసీల్దార్ యం. ఆంజనేయరెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పశు వైద్యాధికారిపై విచారణ

విశాలాంధ్ర-కురిచేడు : స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ నాగేశ్వరరావు విధులకు సక్రమంగా రావటం లేదని అభియోగంపై వచ్చిన ఆరోపణలపై స్థానిక పశు వైద్యశాలకు సంబంధిత శాఖ మార్కా పురం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కే రాఘవయ్య బుధవారం వచ్చి విచారణ చేపట్టారు. పశు వైద్యశాలను సందర్శించిన డిడి ఏడి నాగేశ్వరరావు తో పాటు మండలంలోని అన్ని సచివాలయం పరిధిలో పనిచేస్తున్న పశు వైద్య సిబ్బందిని పిలిపించి విడివిడిగా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డిడి మాట్లాడుతూ పశువైద్యాధికారి సిబ్బంది ద్వారా విచారణ చేపట్టిన అంశాల నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. వీరు వెంట ఈఓ డి ఇ డాక్టర్ చంద్రశేఖర్ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా కలశ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండల కేంద్రమైన పుల్లల చెరువు లోని కోదండరామస్వామి దేవ స్థానంలో బుధవారం కలశ ప్రతిష్ట వైభవంగా జరిగింది. గోపురం కలశం ఊడిపోవడంవల్ల తిరిగి కలశాన్ని జీవపునరుద్ధరించారు. ఈ సందర్భంగా శాంతి హోమం నిర్వహించారు. కలశ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది.

ఉప్పుగుండూరులో పూరిల్లు దగ్ధం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో అంబేద్కర్ నగర్ కు చెందిన నలతోటి రవికుమార్ (రత్నం) కు చెందిన పూరి ఇళ్లు విద్యుత్ సర్క్యూట్ వలన పూర్తిగా దగ్ధమయింది. ఈ సంఘటన మంగళ వారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు దాంతో ఒంగోలు నుండి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి మంటలు అదుపు చేసినప్పటికి ఫలితం లేకుండా పోయింది బాదితుడు రత్నం ఇచ్చిన సమాచారం ప్రకారం ఇంట్లో దాచుకున్న రూ.50 వేలు నగదు,3 సవర్ల బంగారం,2 మొబైల్ ఫోన్లు,కుట్టు మిషన్, పూర్తిగా కాలిపోయాన్నారు. అదేవిధంగా గడ్డివామి కాలిబూడిదైందన్నారు 3 గేదెలు 3 దూడలు ఉండగా వాటిలో రెండుగేదెలకు మూడుదూడలకు స్వల్ప గాయాలైనాయని ఒక గేద పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు దాంతో సర్వం కోల్పోయి కట్టు బట్టలతో మిగిలామని భోరున విలపించారు ఆరుగాలం కష్ట పడి సంపాదించుకున్న సొమ్మంతా కళ్ళఎదుటే బూడిద పాలుకావడం ఆవేదన చెందడంతో చూపరుల సైతం కంట తడి పెట్టించింది ప్రభుత్వపరంగా మాకుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

విశాలాంధ్ర-పామూరు : ఆటో లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ టి కిషోర్ బాబు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం పట్టణంలో సాధారణ తనిఖీలలో భాగముగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలను తమకు కేటా యించిన స్టాండ్‌లో మాత్రమే ఉంచాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఉంచరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉండాలన్నారు. మత్తు పదార్థాలు సేవించి ఆటో నడిపితే కేసు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-తాళ్లూరు : మత్స్య కారులు మత్యశాఖ ద్వారా అమలు చేయు పథకాలపై అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రసా దరావు కోరారు. తాళ్లూరు -1, 2లలో బుధ వారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వ హించారు. ఫిషరీస్ అసిస్టెంట్ వై ఎలీషా మాట్లా డుతూ తాళ్లూరు మండలంలో రెండు ఫిష్ ఆంధ్ర, ఒక మోపెడ్, 20 మందికి మత్స్య కారులకు లైసెన్సులు ఇచ్చినట్లు తెలిపారు. ఆక్వా దారులకు ఆర్ ఎస్ కే ద్వారా చేపల ఫీడ్ తక్కువ ధరకు సరఫరా చేయబడుతుందని చెప్పారు. పథకాలను గురించి తెలుసుకుని ఉపయోగించు కోవాలని కోరారు. వివిఏ నాగ రాజు నాయక్, ఎఈఓ నాగ రాజు సొసైటీ అధ్యక్షురాలు అంజమ్మ, డీఏ ఉమాదేవి పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి ఏర్పాట్లను వేగేశన పరిశీలన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఈ నెల15వ తేదిన కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని బాపట్ల సూర్యలంక సముద్ర తీరం వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అధికారులు,నాయకులుతో కలసి పరిశీలించారు.కార్తీక మాసం సందర్భంగా కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని బాపట్ల సూర్యలంక సముద్ర తీరానికి విచ్చేయుచున్న భక్తులకు,పర్యాటకులకు ఎటువంటి అసౌక ర్యాలు కలగకుండా చూడటానికి అధికారులతో కలిసి ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సలీమా, మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథ్ రెడ్డి,ఏపీ ఓఆర్డి పులి శరత్ బాబు,రూరల్ సీఐ గంగాధర్, మేరైన్ ఎస్సై శ్రీనివాసరావు,మేరైన్ సిబ్బంది,రూరల్ పోలీసులు, టీడీపీ సీనియర్ నాయకులు కావూరి శ్రీనివాస్ రెడ్డి,గజఈతగాళ్లు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటిని కలిసిన మణికేశ్వరం గ్రామస్తులు

విశాలాంధ్ర - అద్దంకి : మండలంలోని మణికేశ్వరం గ్రామస్తులు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను బుధవారం అమరావతి సచివాలయంలో కలిశారు.దక్షిణ కాశీగా ప్రసిద్ది చెందిన మణికేశ్వరం శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని మంత్రిని గ్రామస్తులు ఆహ్వానించారు. కార్యక్ర మంలో ఆలయ ఈవో గుంటుపల్లి వాసు,గ్రామ టీడీపీ నేతలు కరీముల్లా,అంజయ్య, బడావలి,మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి చేయూత

విశాలాంధ్ర - చీరాల : ఎన్.ఆర్ అండ్ పీ.ఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్,చీరాల ఆధ్వర్యంలో క్రీడాకారునికి ఆర్థిక చేయూత అందించారు. మండలంలోని ఈపురుపాలెం గ్రామ నివాసి అయిన క్రీడాకారుడు అడిగోపుల సాంబశివరావు మాస్టర్స్ అథ్లెట్స్ విభాగంలో జాతీయ స్థాయిలో 100 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్,200మీటర్ల 400మీటర్ల పందెంలో సిల్వర్ మెడల్స్ సాధించాడు.ఈ నెల 15,16,17 తేదీలలో బీహార్ రాష్ట్రంలో జరిగే అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెట్స్ క్రీడా విభాగంలో పాల్గొనుటకు అర్హత సాధించాడు. క్రీడా పోటీల్లో పాల్గొనడానికి ఖర్చుల నిమిత్తం వాకర్స్ సభ్యులు రూ.7,000 ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా పోటీలలో విజయం సాధించి చీరాలకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ళ గురుప్రసాద్,అమరా వీరాంజనేయులు, అచ్చుల సదా శివన్నారాయణ,వంగర పూర్ణచంద్రరావు,రమేష్,జాలాది కృష్ణప్రసాద్, శ్రీనివాసరావు,చెన్న నారాయణ,కాటమరాజు, దేవకి సుబ్బారావు, బాల గంగాధర రావు,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల కోసం వ్యక్తిగత అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : పేద ప్రజల స్వంత ఇంటి కల నెరవేర్చడానికి భారత కమ్యూనిస్టు పార్టీ,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘంల సంయుక్త ఆధ్వర్యంలో చీరాల మండలం దేవాంగపురి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అయోధ్యనగర్‌లో వ్యక్తిగత అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు,ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో పేదలకు ప్రకటించిన ఒక సెంటు స్థలం నివాసానికి ఏ మాత్రం సరిపోదన్నారు.సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున నివేశన స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు.గృహ నిర్మాణ వస్తువుల ధరలు పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసి పేదల గృహ నిర్మాణానికి సహకరించాలని కోరారు.ఊళ్లకు,పట్టణాలకు దూరంగా కాకుండా అనువైన ప్రదేశంలో నివేశన స్థలాలు మంజూరు చేసి ఇసుక,సిమెంట్,ఇనుము,ఇటుక,కంకర ప్రభుత్వమే లబ్ధిదారులకు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.ఈ నెల 18వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ,వార్డు సచివాలయాల వద్ద గృహాల మంజూరు కోసం పేదలతో వ్యక్తిగత అర్జీలు అందింపచేసి ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చీరాల నియోజకవర్గ కార్యదర్శి చిరుముల ప్రకాష్, ఏఐటీయూసీ నాయకులు అచ్యుతుని బాబూరావు,సీపీఐ నాయకులు శ్రీమన్నారాయణ, అయోధ్యనగర్ కార్యదర్శి దుర్గాప్రసాద్,చీరాల మండల కార్యదర్శి వీరాంజనేయులు,అయోధ్యనగర్ సంయుక్త కార్యదర్శి శివయ్య, పున్నారావు,అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడుకోవాలి

సీడీపీవో కృష్ణకుమారి

విశాలాంధ్ర - కొరిశపాడు : మండల సమగ్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో బుధవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు 2024 కార్యక్రమాల్లో భాగంగా బాల్య వివాహాలు అంతం చేద్దాం అనే నినాదంతో కూడిన కరపత్రాన్ని సిడిపిఓ ఏ.కృష్ణకుమారి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.ఆమె మాట్లాడుతూ బాల్య వివాహం సమాజంలోని దురాచారానికి దారిద్ర్యానికి ప్రతి రూపమని ఇది చదువు ఆటపాటలతో గడపవలసిన బాల్యాన్ని కష్టాల జీవితంలోకి తీసుకు వెళుతుందని భవిష్యత్తు గురించి కలలు కంటూ నేను టీచర్ అవుతా డాక్టర్ అవుతా అనే కలలను పాడు చేసే పద్ధతే ఈ బాల్య వివాహం అని అన్నారు. జిల్లా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యా సంస్థల్లో విద్యార్థిని,విద్యార్థులకు విద్యా హక్కు చట్టం ద్వారా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక విద్య ప్రతి ఒక్కరికి అందేలాగా అలాగే బాల బాలికలకు జీవించే హక్కు రక్షణ హక్కు వాక్ స్వాతంత్రపు హక్కు భావ ప్రకటన హక్కులు, ఆస్తి హక్కు కూడా సంక్రమించేలాగా చట్టాలు ఉన్నాయన్నారు.ప్రాజెక్టు సూపర్‌వైజర్ కె.ఇందిర మాట్లాడుతూ గతంలో ఎన్నో అవమానాలకు కష్టాలకు గురై వంటింటికే పరిమితమైన విధానాన్ని చూసాం కానీ నాటి రోజులకి నేటి పరిస్థితికి ఎన్నో మార్పులు సమాజంలో బాలికల పట్ల జరుగుతున్నాయి. ఏ.కృష్ణకుమారి మాట్లాడుతూ నేటి సమాజంలో ముఖ్యంగా ఆడపిల్లలు సామాజిక ప్రసారం మాధ్యమాలపై దృష్టి తోటి అనర్థాలను తెచ్చుకుంటున్నారని ఆత్మస్థైర్యంతో ఆడపిల్ల ధైర్యంగా సమాజంలో నిలబడాలంటే తల్లిదండ్రులు పాత్ర కీలకమైందని అదేవిధంగా సమాజంలో మనందరి బాధ్యతగా ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ప్రతిజ్ఞ పూర్వకంగా మానవతా దృక్పథంతో వారి హక్కులను కాపాడాలన్నారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ,సూపర్‌వైజర్లు బాలల హక్కుల వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు.

ప్రజా పోరు కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - మార్టూరు : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరు కరపత్రాల పంపిణీ కార్యక్రమం మార్టూరులో బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరల ఆకాశాన్ని అందుతుండడంతో సామాన్య ప్రజలు ఏమి కొనలేని పరిస్థితుల్లో అల్లాడుతున్నారన్నారు. రాంబాబు బోడంపూడి సూరిబాబు మొగల్ ఇబ్రహీం పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.

16న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - యద్దనపూడి : ఈనెల 16వ తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ మహ్మద్ అఖిబ్ జావిద్ తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ పి.రజని అధ్యక్షుడు జరుగుతుందని,మండలంలోని అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని,అన్ని శాఖల అధికారులు గ్రామలలోని సమస్యలపై పూర్తి అవగాహనతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

గిరిజనులకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెల్డీ.భాగ్య శ్రీధర్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మండలంలోని చందూరుపల్లి గ్రామంలో గత 20 సంవత్సరాలుగా నివసిస్తున్న యానాదుల కాలనీలో ప్రభుత్వాలు ఎటువంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదని గృహాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెల్డీ భాగ్య శ్రీధర్ పేర్కొన్నారు.ఎన్నికల అనగానే గుర్తుకు వచ్చే గ్రామం చందూరుపల్లి అని నాయకులు ఎన్నికల అనంతరం ఆ గ్రామం వైపు చూడరని తెలిపారు.ఆ గ్రామంలో ఇల్లు లేని పేదలకు వ్యక్తిగత అప్లికేషన్లు వితరణ చేసి పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు నివాస స్థలాలు ఇవ్వాలని సీపీఐ పార్టీ,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు నవంబర్ 18న అన్ని గ్రామ వార్డు సచివాలయాల వద్ద జరుగు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బాపట్ల నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బక్క వెంకటరామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ గ్రామంలో నివసిస్తున్న వ్యవసాయ కార్మికులకు మౌలిక వసతులు కల్పించే వరకు సీపీఐ అండగా ఉంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఏట్రా శ్రీనివాసులు, ముత్యాలు తదితర నాయకులు పాల్గొన్నారు.